క్లుప్తంగా

పరిశుభ్రతతో వ్యాధుల దూరం



పెదరాయవరంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

రంగంపేట: పరిశుభ్రతతో వ్యాధుల దూరమవుతాయని, సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా తీసుకోవాలని గ్రామ సర్పంచ్ పెంటా సుజాత అన్నారు. మండలంలోని పెదరాయవరం గ్రామంలో ఆదివారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లి, దోమలు వ్యాప్తి చెందకుండా ఎబేట్‌ను పిచికారీ చేయిస్తున్నట్టు ఆమె తెలిపారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

సీతానగరం: ఇనుగంటివారిపేటలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్టు సీతానగరం ఎస్సై ఎ.ఫణిమోహన్ ఆదివారం తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి ఇనుగంటివారిపేట శివారు ఏటిగట్టుపై పేకాట ఆడుతుండగా ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.3,600 స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న ఏడుగురు ఇనుగంటివారిపేటకు చెందిన వారేనని తెలిపారు. కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని ఎస్సై తెలిపారు.

హిందువుల నిరసన ర్యాలీ



సీతానగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

సీతానగరం: బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హిందువులపై దాడులకు నిరసనగా గ్రామంలోని హిందువులు ర్యాలీ నిర్వహించారు. ఆదివారం సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీ నుంచి సీతానగరం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మండలంలోని భజన బృందాలు, సత్సంగాలు, వివిధ ధార్మిక సంస్థలు పాల్గొని బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హిందు బంధువులు కర్రి శ్రీనివాస్, అద్దే మల్లేశ్వరరావు, ఖండవల్లి సాయి, వంగలపూడి ఆశ్రమ మాతాజీ, కొణపాల అభిలాష, గుల్లి సుబ్బయ్య, బుల్లి చిన్న, సుధాకర్ మాస్టారు, పువ్వాడ కృష్ణ, డేరా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గణపతి నవరాత్ర ఉత్సవాలకు శ్రీకారం



ఉత్సవాలకు రాట మంచి చేస్తున్న కమిటీ సభ్యులు

బిక్కవోలు: కొంకుదురు మార్కెట్ సెంటర్‌లో 63వ గణపతి నవరాత్ర ఉత్సవాలకు శ్రీకారం చుట్టినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ చిన్నం వీరభద్రారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థానిక అర్చకులు భాస్కరశర్మ ఆధ్వర్యంలో గోలుగూరి రామచంద్రారెడ్డి, పావని దంపతులు కర్తలుగా వ్యవహరించనున్నారని తెలిపారు. దానిలో భాగంగా ఆదివారం పందిరి రాట మహూర్తం చేసి ఉత్సవాలను ప్రారంభించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కర్రి రామారెడ్డి, ద్వారంపూడి వెంకటరెడ్డి, మల్లిడి బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్సై ఫణిమోహన్‌కు శుభాకాంక్షలు



ఎస్సైకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ

మధురపూడి: సీతానగరం పోలీసు స్టేషన్‌కు ఎస్సైగా బదిలీపై వచ్చిన ఎ.ఫణిమోహన్‌ను ఎంపీపీ గుర్రాల జోత్స్న ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సఖినేటిపల్లి నుంచి బదిలీపై శనివారం ఇక్కడికి వచ్చారు. ఆయనను ఎంపీపీ, ప్రముఖులు కలిసి, పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. వీరితోపాటు గుర్రాల కృష్ణారావు, గెద్దాడ త్రిమూర్తులు ఉన్నారు.

అప్రకటిత కోతలతో ఇబ్బంది

మధురపూడి: ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ సరఫరాకు కోతలు విధించడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా కోతలు విధించడంతో ఇక్కట్లు గురవుతున్నారు. కోరుకొండ మండలంలో ఈపీడీసీఎల్ సిబ్బంది ఆదివారం మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో చిన్నపెద్దా అంతా ఇబ్బంది పడ్డారు.

ట్రాఫిక్.. ట్రాఫిక్..

- పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్య
- రోడ్డుపైనే వ్యాపారాలు
- కూడళ్లలో ఎంత రద్దీ ఉన్నా కానరాని పోలీసులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



రాజానగరంలోని గాంధీ బొమ్మ సెంటరులో నిత్యం ఇదే పరిస్థితి

రాజానగరం: ఇరుకు రోడ్లు, పెరుగుతున్న జనాభా, వాహనాలతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ప్రయాణికులు గమ్యస్థానానికి చేరుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరంలో ప్రయాణికులను ట్రాఫిక్ సమస్య వేధిస్తున్నా పరిష్కార చర్యలు తీసుకునే వారు కానిపించడంలేదు. ట్రాఫిక్ సమస్య అంటే పోలీసులకు సంబంధించింది కదా అనవచ్చు. నిజమే కానీ ఈ సమస్య నెలకొంటున్న ప్రాంతానికి కొద్ది దూరంలోనే పోలీసు స్టేషను ఉన్నా పట్టించుకోవడంలేదు. పోలీసులంతా తమ పనుల్లో బిజీగా ఉండడంతో ఇక్కడ నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే తీరుబడి వారికి ఉండటం లేదు. అలాగని పంచాయతీ సిబ్బంది స్పందిస్తారా అంటే అదీ కనిపించడం లేదు. అసలు దానితో తమకు సంబంధమే లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. దీని వల్ల నిత్యం ఇక్కడి జనానికి, ప్రయాణికులకు ట్రాఫిక్ సమస్య అలవాటైపోయింది.

రోడ్ల మీదకు వస్తున్న వ్యాపారాలు

గ్రామంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మేజర్ సీసీ డ్రైన్లు ఉన్నాయి. గతంలో ఇక్కడ ఎస్సైగా పనిచేసి ఎస్.భాస్కరరావు వ్యాపారాలు జోరుగా జరిగే స్థానిక బస్టాండ్ నుంచి గాంధీ బొమ్మ సెంటరు, అన్నదాన సత్రం, కోదండ రామాలయం వరకూ ఆ సీసీ డ్రైన్లను లక్ష్మణరేఖగా నిర్ణయించి, వాటిని దాటి వ్యాపారులు ఎవ్వరూ రోడ్డు పైకి రాకూడదంటూ పంచాయతీ అధికారుల ద్వారా అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఆ తరువాత అనేక సందర్భాలలో వ్యాపారులు ముందుకు వచ్చినా గాని, పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండేవారు. అయితే గత కొన్నేళ్లుగా లక్ష్మణరేఖగా ఉన్న మేజర్ సీసీ డ్రైన్లను దాటుకుని మరీ వ్యాపారులు రోడ్డు పైకి విస్తరిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా గాంధీ బొమ్మ సెంటరు నుంచి అటు అన్నదాన సత్రం, ఇటు బస్టాండ్ సెంటర్ వరకు దుకాణాల ముందు వాహనాలు పెట్టుకునే జాగా లేక, ఆయా దుకాణాలకు వచ్చే కస్టమర్లు తమ వాహనాలను రోడ్డు పైనే పార్కు చేస్తున్నారు. మరి కొంత మంది వ్యాపారులు తమ వ్యాపారాలు లోపలికున్నాయంటూ షెడ్లు వేసి మరీ రోడ్డు పైకి వ్యాపారాలను విస్తరించడంతో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్యకు కారణమవుతుంది. అంతేకాదు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు భారీగా పెరిగిపోవడంతో ఈ సమస్య మరింత జఠిలమైంది.

పోలీసు నియంత్రణ కానరాదు

గాంధీ బొమ్మ సెంటరులో ఈ సమస్య మరీ తీవ్రంగా ఉంటుంది. ఎదురుబొదురుగా వచ్చిన ఒక బస్సును మరో బస్సు తప్పించేందుకు కూడా అవసరమైన జాగ లేకుండా ఉందంటే సమస్య తీవ్రత ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇది నిత్యం ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యే అయినా గాని, దానిని నియంత్రించడంలో పోలీసులు ఏ కూడలిలోను కానరారు. గ్రామంలో ఉన్న పోలీసు స్టేషనులో సుమారు 50 మంది సిబ్బంది ఉన్నప్పటికీ ట్రాఫిక్ సమస్య నియంత్రించే బాధ్యతలు ఎవ్వరికీ ఉండడం లేదు. ఆరేళ్ల క్రితం వరకు బస్టాండు సెంటరు, గాంధీ బొమ్మ సెంటరు, వైఎస్సార్ జంక్షన్, హైస్కూల్ జంక్షన్‌లలో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా ఒకరో ఇద్దరో పోలీసులు డ్యూటీ చేసేవారు. ప్రస్తుతం పై సెంటర్లలో ఏ ఒక్క సెంటరులో కూడా పోలీసు జాడ ఉండడం లేదు. అప్పుడప్పుడు వాహనదారులకు ఫైన్లు వేయడానికి తప్ప, ట్రాఫిక్ సమస్య నివారణకు పోలీసులకు తీరిక ఉండడం లేదనే విమర్శలు ఎక్కువగా ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం



గ్రామంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సత్వరమే అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఇక్కడ సీఐగా బాధ్యతలు తీసుకుని వారం రోజులు కూడా కాలేదు. ఒక్కొక్కటిగా అవగాహన చేసుకుంటూ సిస్టమ్‌ని ఒక క్రమపద్ధతిలో పెట్టే ప్రయత్నంలో ఉన్నాం. వాటిలో ట్రాఫిక్ సమస్య కూడా ఒకటి.

– ఎస్.పి. వీరయ్యగౌడ్, సీఐ, రాజానగరం

కూడలిలో పోలీస్ ఉంటే చాలు



కూడలి ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలు సర్వసాధరణమే. అయితే వాటిని నివారించేలా పోలీసులు డ్యూటీ చేస్తుండాలి. కానీ నియోజకవర్గ కేంద్రమని పేరేగాని రాజానగరంలో ఏ కూడలి ప్రాంతంలోను ఒక్క పోలీసు కూడా ఉండరు. స్టేషన్‌లో మాత్రం సిబ్బంది సంఖ్య భారీగా ఉంటుంది. వాహనదారులపై ఫైన్లు వేయడంలో చూపే శ్రద్ధ ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడడంలో లేదనేది వాస్తవం.

– మార్గాని కిషోర్‌కుమార్, ఈలకొలను

మురుగునీరు వెళ్లే మార్గం లేక..



మునికూడలి ఎస్సీపేటలో రోడ్డుపై నిలిచిన మురుకునీరు

సీతానగరం: మునికూడలి అంబేడ్కర్‌పేటలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు రోడ్డుపైనే నిలిచిపోతుంది. మరుగు వేళ్లే మార్గం లేక నెలల తరబడి దుర్గంధం వెదజల్లడం, దోమలకు ఆవాసం మారుతుంది. వర్షం వచ్చి నెల రోజులు కావాస్తున్నా ఇంత వరకూ నీరు బయటకు పోయే మార్గం లేదని స్థానికులు వాపోతున్నారు. మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో ఆ ప్రాంతం వారితోపాటు పాఠశాలకు వెళ్లే విద్యార్థులు మురుగు నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఇంత వరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు అంబటి రాజు, గెడ్డం బాలు, మానుకొండ చిట్టిబాబు, ధార రాజులు ఆరోపించారు. ఇప్పటికైన నీరు రోడ్డుపై నుంచి తరలివెళ్లే మార్గం చూపాలని వారు కోరుతున్నారు

పోలవరం దస్త్రాల దహనంపై విచారణ జరిపించాలి

ధవళేశ్వరం: ప్రతిష్టాత్మక జాతీయ ప్రాజెక్ట్ అయిన పోలవరం ప్రాజెక్టు దస్త్రాల దహనం పై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ తూర్పుగోదావరి ఏలూరు జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం శనివారం ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు పరిపాలన కార్యాలయంలో దస్త్రాలను గుట్టుగా కాల్చివేయడంపై వారి స్పందించి అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని వారు కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరావు, కె.రాంబాబు నగర కార్యదర్శి వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గోష్పాద క్షేత్రంలో చండీ హోమం

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని జ్ఞాన సరస్వతీ మందిరంలో సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి చండీహోమం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ఆత్మీయ హితకారిణీ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

నేడు సుందరేశ్వరునికి సహస్ర ఘటాభిషేకం

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని సుందరేశ్వరస్వామి వారికి సోమవారం సహస్ర ఘటాభిషేకం నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా గోదావరి మాతకు మహానీరాజనం సమర్పిస్తారు. కాల భైరవ స్వామికి అష్టోత్తర పూజ, కూష్మాండ దీపం, శివాలయంలో విశేష పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కొవ్వూరు: మండలంలోని కాపవరం గ్రామంలో కూల్ డ్రింక్స్ షాపులో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న మెంటిమి పవన్‌కుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై జె.ధర్మరాజు తెలిపారు. అతడి వద్ద నుంచి ఎనిమిది క్వార్టర్ మద్యం బాటిళ్లు, రెండు బీర్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సోదర ప్రేమకు ప్రతీక రక్షాబంధన్

- మార్కెట్‌లో రకరకాల డిజైన్లతో రాఖీలు
- కిటకిటలాడిన దుకాణాలు
- రేపు రాఖీ పౌర్ణమి



బిక్కవోలులో అమ్మకానికి ఉంచిన రాఖీలు

బిక్కవోలు: సోదర ప్రేమకు ప్రతీకగా రక్షాబంధన్‌ను జరుపుకొంటారు. శ్రావణ మాసంలో నిర్వహించుకునే అన్నాచెల్లెళ్ల ఆత్మీయ పండగ రాఖీ పౌర్ణమి. సోమవారం రాఖీ పండగను జరుపుకోనున్నారు. రాఖీ అనగా రక్షణ బంధం అని అర్థం. సోదరులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని సోదరి ఆకాంక్షిస్తుంది. జీవితాంతం అండగా ఉంటామని సోదరులు సోదరికి హామీ ఇస్తారు. ఇదే ఈ పండగ ప్రాముఖ్యత. వయస్సు, కులమత భేదం లేకుండా జరుపుకునేది ఈ రాఖీ పండగ. ఈ సందర్భంగా నగరంలో రాఖీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడుతోంది. దేవిచౌక్, కంబాల చెరువు, గోకవరం బస్టాండ్ సెంటర్లు తదితర చోట్లలో కొత్త షాపులు వెలశాయి. రూ.5 నుంచి రూ.500 వరకూ కూడా రాఖీలు ఉన్నాయి.

రకరకాల డిజైన్లు

నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లోని ప్రతి గ్రామంలోనూ కిరణా, ఫ్యాన్సీ దుకాణాలతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షాపుల్లో రాఖీల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. శనివారం ఆయా ప్రాంతాల్లో దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. సరికొత్త డిజైన్లలోని రాఖీలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. పల్లెల్లో రూ.5నుంచి రూ.100ల విలువైన రాఖీలు, అనపర్తి, పెదపూడి, జి.మామిడాడ, బిక్కవోలు తదితర పెద్ద గ్రామంలో రూ.5ల నుంచి రూ.500ల విలువైన రాఖీలను విక్రయించారు. ఆదివారం ఉదయం కూడా రాఖీల అమ్మకం మరింత జోరుగా సాగుతుందని వ్యాపారులు అంచానా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 6 గంటల నుంచే దుకాణాలు తెరచి రాఖీలను వినియోగదారులకు అందుబాటులో ఉంచేందుకు పలువురు వ్యాపారులు ఏర్పాటు చేస్తున్నారు.

రద్దీగా స్వీట్ల దుకాణాలు

సోదరునికి రాఖీ కట్టి స్వీటు తినిపించడం ఆనవాయితీ. రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు చెప్పుకుంటూ స్వీట్లు పంచుకుంటారు. ఈ నేపథ్యంలో స్వీట్ల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి.

పదిమంది తమ్ముళ్లకు కడతా



పది మంది అన్న తమ్ములకు ఒక్కదానే ఆడబిడ్డను. నాకు అంటూ సొంతంగా లేరు అనే బాధ లేకుండా మా పెద్దమ్మ, పిన్నిల పిల్లలు అన్నదమ్ములతో మొత్తం 10 మంది సోదరులకు ప్రతి ఏడాది రాఖీ కట్టడం ఎంతో ఆనందదాయకంగా ఉంటుంది. ఈ ఏడాది కూడా అన్ని ఏర్పాట్లు చేసుకున్నాను.

– గొర్రిపోటి సృజన, పందలపాక

ఓ ధైర్యం



ఎంతో మధురమైనది ఈ రోజు రాఖీ కట్టడంతో మనసు ఎంతో సంతోషాన్నిస్తుంది. ఏటా సోదరుడుకి రాఖీ తప్పకుండా కడతాను. మా అన్నయ్య నాకు ఒక స్నేహితుడుగా ఉంటాడు. నా చిన్నప్పడు నుంచి అన్నయతోపాటు మా పిన్నివాళ్ల పిల్లలకు రాఖీ కట్టడం ఎంతో సంతోషంగా ఉంటుంది.

– యానలపు త్రిపుర ,పెదపూడి

ఎదురుచూస్తా..



తోబుట్టువుల అనురాగానికి ప్రతీక రాఖీ పండగ. మా తమ్ముడికి ఏటా రాఖీ కడతాను. ఏటా ఈ పండగ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తుంటాను. రాఖీ కడుతున్నప్పుడు మధురానుభూతి కలుగుతుంది, సోదరుడుతో మంచి అనుబంధాన్ని కలిగిస్తుంది.

– పదాల దేవి, పాలమూరు

కోటిపల్లి కాలువకు గండి



కడియపులంక వద్ద ఇరిగేషన్ కాలువకు పడిన గండి నుంచి నర్సరీల్లోకి ప్రవహిస్తున్న నీరు

- నీట మునిగిన నర్సరీలు
- లక్షల్లో ఆస్తినష్టం

కడియం: ధవళేశ్వరం నుంచి కోటిపల్లి వెళ్లే తూర్పుడెల్టా కాలువకు కడియం మండలం కడియపులంక వద్ద గండి పడింది. ప్రస్తుతం పంట కాలం కావడంతో కాలువల్లోకి నీటిని విడుదల చేశారు. పోటుగా కాలువ ప్రవహిస్తోంది. కడియపులంక వద్ద కాలువగట్టు తెగిపోయింది. ఈ గండి కారణంగా సమీపంలోని 15 ఎకరాలకుపైగా నర్సరీ మొక్కలు నీటమునిగాయి. వివిధ రకాల పండ్ల, అలంకరణ మొక్కలతోపాటు అరటి, దొండ తదితర కూరగాయల పంటలు కూడా నీటమునిగిపోయాయి. దీంతో దాదాపు 50 మంది రైతులకు సంబంధించి రూ.లక్షల్లోనే ఆస్తినష్టం జరిగిందని నర్సరీ రైతులు వాపోతున్నారు. బ్యాంకుల్లో రుణాలు తెచ్చి పెట్టుబడులు పెట్టి నర్సరీ మొక్కలను పెంచుతున్నామని, కాలువ గండితో పెట్టుబడులు నష్టపోవాల్సిన పరిస్థితి ఎదురైందని రైతులు వాపోతున్నారు. ధవళేశ్వరం పర్యటనకు వచ్చిన మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి కాలువకు గండిపడిన విషయాన్ని రైతులు తీసుకువచ్చారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించారు. రక్షణ చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు.

కోల్‌కతా సంఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు తదితరులు

రాజానగరం: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యు) విజృంభన జిల్లా శాఖ ఆధ్వర్యంలో తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవతా నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ: మానవతా సంస్థ సేవా కార్యక్రమాలను మరింత విస్తృత చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు సంస్థ నూతన అధ్యక్షుడు పాలకృష్ణ ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా పాలకృష్ణ ప్రసాద్ రెడ్డి ఉపాధ్యక్షుడిగా రొంగల బాబూరావు, సెక్రటరీగా యావీఎస్ సత్యనారాయణ(ఉప్పల శీను), జాయింట్ సెక్రటరీగా బొదిరెడ్ల అప్పారావు ప్రమాణస్వీకారం చేశారు. వీరితోపాటు కోశాధికారిగా దాసరి సాయిబాబా, ఈసీ సభ్యులుగా హెల్త్ విభాగం కన్వీనర్‌గా డాక్టర్ కొమ్మ శ్రీనివాస్, అవేర్‌స్ విభాగం కన్వీనర్‌గా జి.విజయకిరణ్, ఎడ్యుకేషన్ విభాగం కన్వీనర్‌గా యు.శ్రీరామ్మూర్తి ఎమర్జెన్సీ విభాగం కన్వీనర్‌గా తమ్మా రవిలతో పశ్చిమ గోదావరి జిల్లా కన్వీనర్ వి.చంద్రయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సంస్థ ద్వారా ఉచిత అంబులెన్స్‌సౌకర్యాలు, శాంతిరథం ఉచితంగా అందించడంతోపాటు విద్య, వైద్యం మొదలగు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. సంస్థ రీజినల్ చైర్మన్ సీహెచ్ ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ బీఎస్‌ఎన్ మూర్తి, కో చైర్మన్ మద్దుల మురళీ కృష్ణ, పూర్వపు అధ్యక్షులు బూర్లగడ్డ మురళి,ఎంవీ ధర్మారెడ్డి, న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి, వ్యక్తిత్వ వికాశ నిపుణులు దారపు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటితేనే పర్యావరణానికి రక్షణ

- శ్రీఅమ్మ ఒడి సేవాతరంగిణి అధ్యక్షుడు విజయస్వామి
- కోలమూరులో 750 మొక్కలు నాటిన వైనం



కోలమూరులో మొక్కలు నాటుతున్న శ్రీఅమ్మ ఒడి సేవా తరంగిణి సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: మొక్కలు నాటడంతో పర్యావరణాన్ని కాపాడవచ్చని శ్రీఅమ్మ ఒడి సేవాతరంగిని అధ్యక్షుడు విజయస్వామి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కోలమూరులో శ్రీఅమ్మ ఒడి సేవాతరంగిణి ఆధ్వర్యంలో 750 మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయస్వామి మాట్లాడుతూ ఏబీవీపీలోని స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ విభాగం, చేతనా ప్రకృతిసేవా సంస్థ సభ్యులు మొక్కలు నాటడంలో సహకారం అందించారన్నారు. కార్యదర్శి శివ స్వామి మాట్లాడుతూ చిరంజీవి, ఇషా ప్రథమ జన్మదినం సందర్భంగా నాయుడు గారి వంటిల్లు అధినేత రాకేష్, రమాదేవి దంపతులు ఈ కార్యక్రమానికి సహకరించారని తెలిపారు. జనసేన పార్టీ నగర ఇన్‌చార్జి అను శ్రీ సత్య నారాయణ చేతుల మీదుగా మొక్కలు నాటి,శ్రమదానం చేసిన సేవకులకు పుస్తక పంపిణీ చేశారని అన్నారు. చేతనా సంస్థ సభ్యులు సత్యం, సూర్యనారాయణ, సేవా తరంగిణి సభ్యులు కురుమళ్ళ నాగ వెంకట ధన లక్ష్మి, బూటి నాగమణి, ఐసెట్టి వీర వెంకట సత్యనారాయణ, లోకేష్, దొరబాబు, కోయ దుర్గా భవాని, సాయి భరద్వాజ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

నల్లజర్ల: జాతీయ రహదారిపై మండలంలోని అనంతపల్లి గ్రామ సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదం సంభవించింది. మోటారు సైకిల్‌ను కారు ఢీకొట్టిన ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. అనంతపల్లి ఎస్సీ కాలనీకి చెందిన పాకా రమేష్ అనే వ్యక్తి తన భార్య లావతో కలిసి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో దంపతులిద్దరికీ తీవ్ర గాయాలపాల్యారు. ఇరువురినీ హైవే పోలీసులు అంబు లెన్స్‌లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కిడ్నీ బాధితుడికి మానవత ఆర్థిక సాయం



వైద్య ఖర్చుల నిమిత్తం వెంకట్రాజుకు ఆర్థిక సాయం చేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

తాళ్లపూడి: రెండు కిడ్నీలూ పాడవడంతో మండలంలోని అన్నదేవరపేట గ్రామానికి చెందిన కొలూరి వెంకట్రాజు డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆయన వైద్య ఖర్చులకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ప్రతినిధులు ఆదివారం వెంకట్రాజు ఇంటికి వెళ్లి అతడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.6 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్, ఉపాధ్యక్షుడు తిరిగిపల్లి దోసాలు, సభ్యులు సనపల రాజశేఖర్, ఎ.హనుమంతరావు, పెమ్మాడి దుర్గాప్రసాద్, గెద్దం సాయిబాబా, కవల రామాంజనేయులు, ఇంజరపు సత్యనారాయణ, గుప్త పాల్గొన్నారు.